క్లుప్తంగా

'కార్యదర్శుల ద్వారా చెక్కులను పంపిణీ చేయించండి'

మోర్తాడ్‌: బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను పంచాయతీ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేయించాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం ఆర్మూర్‌ ఆర్డీవోకు లేఖ రాశారు. ప్రోటోకాల్‌ ప్రకారం ఎమ్మెల్యేల ద్వారా చెక్కులను పంపిణీ చేయాల్సి ఉండగా ఇటీవల మంజూరైన చెక్కులను పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యేను కోరారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తాను హాజరు కాలేనని స్పష్టం చేశారు.

వర్ని ఎస్సైగా మహేశ్‌



వర్ని: వర్ని ఎస్సైగా ఉడతా మహేశ్‌ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఎస్సైగా పని చేసిన రమేశ్‌ను వీఆర్‌కు పంపగా, నిజామాబాద్‌ 3వ టౌన్‌ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మహేశ్‌ను వర్నికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌ తనిఖీ



ఎడపల్లి(బోధన్‌): ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ సాయిచైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌ రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌, బోధన్‌ రూరల్‌ సీఐ విజయ్‌ బాబు, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ ఉన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పోలీస్‌ కార్యాలయాలను సీపీ సాయిచైతన్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భరోసా సెంటర్‌, షీ టీమ్‌ కార్యాలయం, పోలీస్‌ ఫిల్లింగ్‌ స్టేషన్‌, సౌత్‌ రూరల్‌ ఆఫీస్‌ లను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు.

నవీపేటలో పాఠశాల..

నవీపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు టీఎస్‌ మోడల్‌ పాఠశాలను డీఈవో అశోక్‌ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలలో 626 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈవో సక్కి.. డీఈవోకు వివరించారు.

'ఆర్‌ఐ వేధిస్తున్నాడు'

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ మండల ఆర్‌ఐ తనను వేధింపులకు గురి చేస్తున్నాడని మండలంలోని కొప్పర్గ గ్రామానికి చెందిన ఇసుక వ్యాపారి సయ్యద్‌ అజీజ్‌ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడారు. ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నా డబ్బులు డిమాండ్‌ చేస్తే ఇవ్వకపోవడంతో వాహనాలను నిలిపేశాడని, తనతో పాటు బంధువులకు సైతం వేబిల్లులు ఇవ్వడం లేదని ఇదేంటని అడిగితే మీ ట్రాక్టర్లు, టిప్పర్లను బ్లాక్‌ లిస్టులో పెట్టామని అందుకే ఇవ్వడం లేదని చెప్పినట్లు వెల్లడించారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలో హైస్కూల్‌ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు సీసీ రోడ్డును నిర్మించాలని మండల బీజేపీ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. ఈమేరకు శుక్రవారం కోటగిరి తహసీల్‌ కార్యాలయంలో స్థానిక పార్టీ నేతలతో కల్సి వినతిపత్రం అందజేశారు. నేతలు రాజు, సాయిప్రసాద్‌, శ్యాం, సతీష్‌, విఠల్‌, నరేష్‌, గంగాధర్‌ పాల్గొన్నారు.

చలి వేంద్రాల ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలో మున్సిపల్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరు చలివేంద్రాలను మున్సిపల్‌ కమిషనర్‌ రాజు ప్రారంభించారు. కొత్త బస్టాండ్‌, మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్‌ బస్టాండ్‌ వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

పరీక్ష అట్టలు, పెన్నుల పంపిణీ

రుద్రూర్‌: శ్రీ వేద హైస్కూల్‌లో కోటగిరి లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ డైమండ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను పంపిణీ చేశారు. లయన్స్‌ క్లబ్‌ సభ్యులు ఉమాకాంత్‌ కులకర్ణి, తెల్ల రవికుమార్‌, హనుమంతరావు పటేల్‌, ఉపాధ్యాయులు నిర్మల, నఫీస్‌, సాయి పవన్‌, సాయినాథ్‌, భీంరావ్‌,విద్యార్థులు పాల్గొన్నారు

గిట్టుబాటు ధర లేక రైతన్న విలవిల

- క్వింటాల్‌కు రూ.1,800లు చెల్లిస్తున్న దళారులు
- ప్రభుత్వ మద్దతు ధర రూ.2,280



వర్ని మండలంలో వరి ధాన్యాన్ని కాంటా చేస్తున్న దళారులు

వర్ని: కష్టపడి పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతన్న విలవిలలాడుతున్నాడు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు అందిన కాడికి దోచుకుంటున్నారు. పండించిన పంటను పొలంలో ఉంచలేక లాభనష్టాలను అంచనా వేయకుండా రైతులు వచ్చిన కాడికి అమ్ముకుందామని దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోతున్నారు. ప్రభుత్వం వరి సన్నరకానికి మద్దతు ధర రూ.2,320, దొడ్డు రకం రూ.2300 చెల్లిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కాంటా చేయడం లేదు. దీంతో రైతులు పంటను పొలంలో ఉంచుకోలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు క్వింటాల్‌ రూ.1,800కే కొనుగోలు చేస్తున్నారు. పైగా 4.5 కిలోల తరుగు తీస్తున్నారు. దీంతో కనీసం క్వింటాలుకు రూ.700 మేర రైతు నష్టపోతున్నారు. ఈ లెక్కన ఎకరానికి సుమారు రూ.20 వేలు రైతు నష్టపోతున్నాడు.

సరైన ధర లేదు



దళారులు గిట్టుబాటు ధర చెల్లించడం లేదు. క్వింటాలకు రూ.1,800 మాత్రమే చెల్లిస్తున్నారు. ఇష్టముంటే ఇవ్వండి లేకపోతే లేదని దళారులు అంటున్నారు. పెట్టుబడికి అయిన ఖర్చు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వమే ఆలోచించి రైతులను ఆదుకోవాలి. దళారులను ప్రభుత్వం నియంత్రించాలి. మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చట్టం తీసుకురావాలి. – లచ్చయ్య, రైతు, బొప్పాపూర్‌

గత్యంతరం లేక అమ్ముకుంటున్నాం



రైతుల అవసరాలను ఆసరా చేసుకొని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. గత్యంతరం లేక పంటను వదిలేయలేక దళారులు అడిగిన ధరకే విక్రయిస్తున్నాము. కోతల సమయాన్ని బట్టి కొనుగోలు కేంద్రాలను ముందుగా ప్రారంభిస్తే గిట్టుబాటు ధర అందేది. వర్ని ప్రాంతంలో కోతలు ప్రారంభమై వారం గడుస్తోంది. సమయానికి కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. – నూనె వీర్రాజు, రైతు, వర్ని

నిజాం షుగర్స్‌ పునరుద్ధరణకు కృషి

- బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి
- సాలూరలో మండల పరిషత్‌ కార్యాలయం ప్రారంభం



సాలూరలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌/ఎడపల్లి/రెంజల్‌: నిజాంషుగర్స్‌ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కృషి చేస్తున్నామని, నిపుణుల సలహాలు తీసుకొని పాత ఫ్యాక్టరీని నడిపించడమా లేదా కొత్త ఫ్యాక్టరీని నెలకొల్పి నడిపించడమా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని.. అంకితభావంతో పని చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి అండగా నిలువాలని మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌ రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం సాయంత్రం సాలూర మండల కేంద్రంలో కొత్తగా మండల ప్రజాపరిషత్‌ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బోధన్‌ టీటీడీ కల్యాణ మండపంలో, ఎడపల్లి మండల పరిషత్‌ కార్యాలయంలో, రెంజల్‌ మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ పథకం దరఖాస్తుదారులకు చెక్కులను పంపిణీ చేశారు. బీసీ రిజరేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన నేపథ్యంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం, సీఎం రేవంత్‌ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పని చేసే వారిని గెలిపించాలన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ చీల శంకర్‌, టీపీసీసీ డెలిగేట్‌ బి.గంగాశంకర్‌, సాలూర సొసైటీ చైర్మన్‌ అల్లె జనార్దన్‌, ఎడపల్లి, రెంజల్‌ మండలాల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పంట కాలువ పరిశీలన



శాఖాపూర్‌ శివారులో కాలువను పరిశీలిస్తూ..

నవీపేట: శాఖాపూర్‌ శివారులోని నిజాంసాగర్‌ డి-50 ఉప కాలువను బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. నిజాంసాగర్‌ అలీసాగర్‌ ఎత్తిపోతల పథకం నుంచి నిజాంసాగర్‌ చివరి ఆయకట్టుకు సాగు నీటి సరఫరాను పరిశీలించేందుకు ఆయన ఇక్కడికి వచ్చారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచించారు.

ఎడపల్లిలో ప్రారంభమైన వరికోతలు



బాపూనగర్‌లో రైతు అమ్మిన ధాన్యాన్ని లారీల్లో ఎక్కిస్తున్న కూలీలు

ఎడపల్లి (బోధన్‌): ఎడపల్లి పరిధిలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇదే అదునుగా భావించిన దళారులు రైతులను దోచుకుంటున్నారు. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు సంభవిస్తుండటంతో రైతులు ఆందోళనకు గురి అవుతున్నారు. వర్షానికి దళారులు చెప్పిన రేటుకే ధాన్యాన్ని అమ్మడానికి సిద్ధమవుతున్నారు. ప్రభు త్వం ప్రకటించిన వరి మద్దతు ధర క్వింటాల్‌ రూ.2300కు కాకుండా రూ.1900కే దళారులకు రైతులు అమ్ముకుంటున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఎడపల్లి పరిధిలో ధాన్యం తడిసింది. ప్రభుత్వ ఇచ్చే రూ.500 బోనస్‌ కూడా నష్టపోతున్నారు.

జన్నేపల్లి సంతకు రూ.3.58 లక్షలు

నవీపేట: జన్నేపల్లిలో ప్రతి బుధవారం నిర్వహించే వారాంతపు కూరగాయల సంతకు శుక్రవారం జీపీ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. రూ.20 వేల చొప్పున డిపాజిట్‌ చెల్లించిన 13 మంది ఔత్సాహికులు ఈ వేలంలో పాల్గొన్నారు. బాలాజీ అనే వ్యక్తి రూ.3.58 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఎంపీవో రామకృష్ణ, కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

నేడు బోధన్‌లో తైబజార్‌ వేలం

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ బల్దియా పరిధిలోని తైబజార్‌, స్లాటర్‌ హౌజ్‌ల వేలం పాట శనివారం బల్దియా కార్యాలయంలో నిర్వహించనున్నామని కమిషనర్‌ వెంకట నారాయణ శుక్రవారం తెలిపారు. టెండర్‌లో పాల్గొనే వారు సకాలంలో హాజరు కావాలన్నారు.

హరీశ్‌ రావు, కేటీఆర్‌ల మధ్య ఆధిపత్య పోరు



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్‌

ఆర్మూర్‌టౌన్‌: బీఆర్‌ఎస్‌లో బావాబామ్మర్దులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల మధ్య ఆధిపత్య పోరు జరుగుతోందని.. కేటీఆర్‌ చేసే పాదయాత్ర ఆధిపత్యం కోసమేనని టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్‌ ఆరోపించారు. ఆర్మూర్‌ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు సంవత్సరం పాటు 'జై భీమ్‌ జై బాపు జై సంవిధాన్‌' కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో ఆర్మూర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని ప్రజల్లోకి తీసుకెళ్లి, హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్‌, దేగాం ప్రమోద్‌, పాషా, ప్రవీణ్‌, తలారి రాకేష్‌, అరుణ్‌, రాజకుమార్‌గౌడ్‌ పాల్గొన్నారు.

బోధన్‌ బార్‌ అసోసియేషన్‌ ఎన్నికల షెడ్యూల్‌ విడుదల



షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న న్యాయవాదులు

బోధన్‌: బోధన్‌ బార్‌ అసోసియేషన్‌ ఎన్నికల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు స్థానిక సీనియర్‌ న్యాయవాదులు జె.నందకుమార్‌, సి.గోపాల్‌ రెడ్డిలను అడహక్‌ కమిటీ సభ్యులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. శనివారం నుంచి ఈ నెల 26 వరకు నామినేషన్లు, 27న నామినేషన్ల పరిశీలన, పోటీ చేసే అభ్యర్థుల జాబితా విడుదల, 28 నామినేషన్‌ విత్‌డ్రాలు, తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఏప్రిల్‌ 4న పోలింగ్‌, కౌంటింగ్‌ సాయంత్రం ఫలితాలు విడుదల చేస్తామని సభ్యులు పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



జాన్కంపేట్‌లో భూమిపూజ చేస్తున్న అన్వేష్‌రెడ్డి



మోస్రాలో.. ఎంపీడీవో శ్రీనివాస్‌

వేల్పూర్‌: జాన్కంపేట్‌లో ఉపాధిహామీ ద్వారా రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ సుంకెట అన్వేష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వేల్పూర్‌ ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ గడ్డం నర్సారెడ్డి, నాయకులు జేమ్స్‌ గంగారెడ్డి, సొడ శ్రీనివాస్‌, కిశోర్‌గౌడ్‌, కుమ్మరి గంగాధర్‌, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోస్రా మండల కేంద్రంలో..

వర్ని: మోస్రా మండల కేంద్రంలో రూ. 25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్‌ భూమిపూజ చేశారు. తహసీల్దార్‌ మారుతి, వీడీసీ చైర్మన్‌ పోతారెడ్డి పాల్గొన్నారు.

కూనిపూర్‌లో జీపీ భవన నిర్మాణానికి ..

వర్ని: కూనిపూర్‌లో ఉపాధి హామీ పథకం కింద నిర్మాణం చేపట్టనున్న జీపీ భవన నిర్మాణానికి శుక్రవారం వర్ని ఎంపీవో మారుతి భూమి పూజ చేశారు. రూ.40 లక్షలతో జీపీ భవనం, రూ.20 లక్షలతో శివాలయం దగ్గర సీసీ ఫ్లాట్‌ ఫామ్‌, రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, రూ.5 లక్షలతో మురికి కాలువ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నాయకులు రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.



కూనిపూర్‌లో .. ఎంపీవో మారుతి

పిచ్చి మొక్కలు పీకేశారు.. రోడ్డుపైనే వదిలేశారు



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ ఆనకట్టపై పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను నరికి కట్టపైనే అలానే వదిలేశారు. గురువారం రాత్రి గాలితో కూడిన వర్షం దంచి కొట్టడంతో ఆనకట్ట రోడ్డు మధ్యలోకి వచ్చి చెత్త పడింది. దీంతో ఆనకట్ట రోడ్డు చెత్తమయంగా మారింది.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

మాక్లూర్‌: రైతులు వారి పంటపొలాల్లో నీటి గుంతలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా భూగర్భజలశాఖ అధికారి శ్రీనివాస్‌ బాబు సూచించారు. వరల్డ్‌ వాటర్‌ డేను పురస్కరించుకుని శుక్రవారం అమ్రాద్‌ ప్రభుత్వ పాఠశాలలో నీటి పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు .. ప్రతి ఒక్కరు వారి ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు, రైతులు వారి పొలాల్లో బావిని తలపించే గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం నీటి వినియోగంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఉద్యానవన సంచాలకులు విజయలక్ష్మి, ఆర్‌ రవీందర్‌, లాయక్‌ మోహినోద్దీన్‌, మత్స్యశాఖ అధికారి అనిల్‌ కుమార్‌, మాక్లూర్‌ ఏవో పద్మ పాల్గొన్నారు.

మట్టి కుండలకు డిమాండ్‌



విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల కుండలు

ఆర్మూర్‌టౌన్‌: ఎండాకాలంలో వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు మట్టికుండల వైపు మొగ్గుతున్నారు. కుండల ధరలు కాస్త పెరిగినా ప్రజలు కొనుగోలు చేయడంలో వెనకడుగు వేయడం లేదు. మట్టికుండల్లో నిల్వ చేసే నీరు సహజంగా చల్లగా ఉండటంతో ప్రజలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మట్టిపాత్రలు వాడటం వల్ల ప్లాస్టిక్‌ వ్యర్థాలు తగ్గించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మట్టికుండ 10 లీటర్ల నుంచి 20 లీటర్ల వరకు అందుబాటులో ఉన్నాయి. ఆర్మూర్‌ పట్టణంలో రూ. 100 నుంచి మొదలు కొని రూ.300 వరకు ధర పలుకుతున్నాయి.

గిరాకీ బాగానే ఉంది

మట్టి కుండల విక్రయం బాగానే ఉంది. ప్రజల కోసం పలు రకాల బొమ్మలతో కూడిన మంచి నీటి బాటిల్లు, జగ్గులు తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. కుండ నీరు తాగడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

– సునీల్‌, మట్టి కుండల వ్యాపారి

పది పరీక్షలు.. తనిఖీల తర్వాతే లోనికి..



పడగల్‌ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద పదవ తరగతి విద్యార్థుల సందడి



బోధన్‌ పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రంలోనికి దివ్యాంగ విద్యార్థిని ఎత్తుకొని వెళ్తున్న తండ్రి

జిల్లాలో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కాగా.. విద్యార్థులందరూ నిర్ణీత సమయానికే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ప్రత్యేకంగా వీల్‌ చైర్లు అందుబాటులో లేకపోవడంతో బోధన్‌ డివిజన్‌ పరిధిలో ఓ దివ్యాంగ విద్యార్థి ఇబ్బంది పడ్డాడు. దీంతో ఆ విద్యార్థిని.. తండ్రే మోసుకుంటూ పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లాడు. బోధన్‌ పరిధిలో ఆరుగురు, పొతంగల్‌ పరిధిలో ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. – సాక్షి నెట్‌వర్క్‌



బాల్కొండ: కిసాన్‌ నగర్‌ పరీక్షా కేంద్రం వద్ద..



ముప్కాల్‌ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద..

సినిమాలు

పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (ఆర్మూర్‌)

స్క్రీన్‌-1 ఓ అందాల రాక్షసి 11.00, కిస్‌ కిస్‌ కిస్సిక్‌ 1.45, 7.35, ఆర్టిస్ట్‌ 4.35, 10.25

స్క్రీన్‌-2 ఛావా10.00, 4.00, 10.00 షణ్ముక 1.20, 7.20

స్క్రీన్‌-3 సలార్‌–పార్ట్‌–1 10.00, 4.05, 10.10 పెళ్లికాని ప్రసాద్‌ 1.30, 7.35

స్క్రీన్‌-4 కోర్ట్‌ 10.00, 1.05, 4.10, 7.15, 10.20

మాంసం ధరలు(రూ..)

చికెన్‌	ధరలు (కిలోకు)	డ్రెస్డ్‌	140
		లైవ్‌	90
స్కిన్‌లెస్‌	160	మటన్‌	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్‌	90,900	వెండి(కిలో)	1,04,500
22 క్యారెట్స్‌	83,897		

– నిజామాబాద్‌ బిజినెస్‌

సంక్షిప్తం

ఫీడర్‌ బ్రేకర్‌ ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్‌ మండలం రెంజర్ల సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌ సమస్యలు తలెత్తకుండా నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్‌ బ్రేకర్‌ను శుక్రవారం ట్రాన్స్‌కో డీఈఈ రాజేశ్వర్‌ ప్రారంభించారు. వ్యవసాయంగానికి, గ్రామానికి విద్యుత్తు సరాఫరా వేర్వేరుగా ఉండాలనే ఫీడర్‌ బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏడీ శ్రీనివాస్‌, ఏఈ శ్రీనివాస్‌, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రూర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌..



రుద్రూర్‌: సమ్మర్‌ యాక్షన్‌లో భాగంగా రుద్రూర్‌ మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయ సమీపంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం విద్యుత్‌ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో డీఈ ముక్తార్‌ మాట్లాడుతూ.. బోధన్‌ డివిజన్‌ పరిధిలో 150 నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఏడీ నగేష్‌ కుమార్‌, ఏఈ శ్రీనివాస్‌, సబ్‌ ఇంజినీర్‌ నవీన్‌, తదితరులు పాల్గొన్నారు.

ఎవరినీ బహిష్కరించలేదు

బాల్కొండ: మెండోరా మండలం సావెల్‌లో ఎవరిని బహిష్కరించలేదని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం మెండోరా పోలీస్‌ స్టేషన్‌కు వారు తరలివచ్చి మాట్లాడారు. అందరం కలిసిమెలిసి ఉన్నామని తెలిపారు. గ్రామంలో తమ మధ్య ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు.

మోర్తాడ్‌ వీడీసీ కార్యవర్గం ఎన్నిక

మోర్తాడ్‌: మోర్తాడ్‌ వీడీసీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోతె సుభాష్‌, ఉపాధ్యక్షునిగా ఏజీవీ చిన్నారెడ్డి, కోశాధికారిగా పుప్పాల రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఇతర ప్రతినిధులు సభ్యులుగా కొనసాగుతారు. రానున్న ఉగాది రోజున వీరు బాధ్యతలను స్వీకరించనున్నారు. ఏడాది కాలం పాటు ఈ కార్యవర్గం పని చేస్తుంది.

భగత్‌ సింగ్‌ వర్ధంతి సభలను జయప్రదం చేయండి



కమ్మర్‌పల్లి: కామ్రేడ్‌ భగత్‌ సింగ్‌ 94వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్‌ మాస్‌లైన్‌ మండల కార్యదర్శి బషిరి అశోక్‌ పిలుపునిచ్చారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఆపార్టీ కార్యాలయంలో ఈమేరకు వాల్‌ పోస్టర్లను ఆవిష్కరించారు.నాయకులు సారా సురేష్‌, సత్తెక్క, బాలకిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీవైఎల్‌, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌ సింగ్‌, రాజగురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా మార్చి 23న వర్ధంతి సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నేతలు ఎం. నరేందర్‌, వినోద్‌, సిద్ధు, శ్రీకాంత్‌, పూజ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ శ్రీకాంత్‌కు నివాళులు



ఆర్మూర్‌ టౌన్‌ : ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌(33) శుక్రవారం ఉదయం గుండె పోటుతో మరణించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌ రవికుమార్‌ ఆధ్వర్యంలో శ్రీకాంత్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన బాధాకరమని వారు అన్నారు. డాక్టర్‌ శ్రీకాంత్‌ స్వగ్రామం వర్ని మండలం మోస్రాలో అంత్యక్రియలు నిర్వహించారు.